


జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | 1 | నవంబర్ | 2025 ◆ పేజీలు : 6



## నాగరాజు ఆత్మహత్య కేసులో...

# ఐదుగురిపై ఎఫ్ఐఆర్

- **ఇద్దరు రిమాండ్, ముగ్గురు పరారీలో..**
- **పోలీసు చర్యలతో దర్యాప్తు వేగం**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, అక్టోబర్ 31, ప్రజాజ్యోతి:** వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక మృతి చెందిన పాత కొత్తగూడెం ప్రాంతానికి చెందిన మెరుగు నాగరాజు ఆత్మహత్య కేసు దర్యాప్తులో చివరకు కదలిక చూపింది. వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఐదుగురిని నిందితులుగా గుర్తిస్తూ ఎఫ్ ఐఆర్ నమోదు చేసినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ కేసులో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్కు పంపగా, మిగిలిన ముగ్గురు ప్రస్తుతం పరారీలో ఉన్నట్టు సమాచారం. గత కొన్ని వారాలుగా కేసు పురోగతి లేకపోవడంపై వస్తున్న విమర్శల నేపథ్యంలో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేసినట్టు తెలుస్తోంది. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు, మృతుడి చివరిగా రికార్డ్ చేసిన వీడియో సాక్ష్యం, అందులో పేర్కొన్న వివరాలు ఆధారంగా పోలీసులు ప్రాథమిక విచారణను పూర్తి చేశారు. మొదట ఇద్దరిపై కేసు నమోదు కాగా, అనంతరం సేకరించిన సాక్ష్యాల ఆధారంగా మరో ముగ్గురిని కూడా కేసులో చేర్చినట్టు తెలిసింది. దీంతో మొత్తం ఐదుగురిపై ఎఫ్ ఐఆర్ నమోదయింది. వీరిలో ఇద్దరు పోలీసులకు పట్టుపడ్డారు. వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్కు పంపించారు. మిగిలిన ముగ్గురు మాత్రం ఇప్పటికి పరారీలో ఉన్నాట్టు సమాచారం. అయితే ఈ కేసులో కీలక నిందితుడిగా ఉన్న సింగరేణి ఉద్యోగిని మొదటి నుంచే తప్పించేందుకు ప్రయత్నాలు జరిగాయని స్థానిక వర్గాలు చెబుతున్నాయి. ఆ వ్యక్తిని కేసు నుండి తప్పించే దిశగా కొంతమంది ప్రభావవంతులు, రాజకీయంగా దగ్గరగా ఉన్నవారు కూడా పోలీసులపై ఒత్తిడులు తెచ్చినట్టు సమాచారం. అయినప్పటికీ పోలీసు అధికారులు ఎలాంటి ఒత్తిడులకు లోనుకాకుండా చట్టపరమైన చర్యలు కొనసాగించినట్టు తెలిసింది. చివరకు ఆ నిందితుడిపైనా ఎఫ్ ఐఆర్ నమోదు అయినప్పటికీ, అరెస్టు మాత్రం ఇంకా జరగలేదు. ఎలాగైనా అతనిని ఆరెస్ట్ చెయ్యాలని ప్రజల నుండి డిమాండ్ వినబడుతోంది. దీంతోపాటు ఈ ఘటన బయటపడిన నాటినుంచి పోలీస్ స్టేషన్ పరిసరాల్లో చోటుచేసుకున్న పరిణామాల్లో కొంతమంది మధ్యవర్తులుగా వ్యవహరించి, దర్యాప్తు దిశను మళ్లించే ప్రయత్నాలు చేసినట్టు కూడా సమాచారం. వారి పాత్రపై పోలీసులు సవివరంగా పరిశీలన జరిపి, సంబంధిత ఆధారాలు సేకరించినట్టు తెలిసింది. ఆ వ్యక్తులపై కూడా చర్యలు తీసుకునే దిశగా పోలీసు అధికారులు ముందడుగు వేస్తున్నట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం పోలీసులు సాంకేతిక ఆధారాల సేకరణ, కాల్ డీటెయిల్ రికార్డు (సిడిఆర్) ల పరిశీలన, సాక్షుల వాంగ్మూలాలపై దృష్టి పెట్టారు. ఎఫ్ఐఆర్ అయిన వాళ్ళలో ఇంకా పట్టుబడని మిగిలిన నిందితులను పట్టుకునేందుకు కూడా ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది.




## విజిలెన్స్ లో కృత్రిమ మేధా టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేయాలి

- **హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్**
- **విజిలెన్స్ శిక్షించే వ్యవస్థగా కాదు... సంస్కరించే వ్యవస్థగా రూపుదిద్దుకోవాలి:**
- **జీఎస్టీ రంగారెడ్డి కమిషనరేట్ ప్రిన్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావు**
- **సింగరేణి విజిలెన్స్ వారోత్సవాల్లో ప్రముఖుల సందేశాలు**
- **రానున్న రోజుల్లో దేశంలోని 10 రాష్ట్రాల్లో సింగరేణి కార్యకలాపాలు**
- **సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్**

**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 31, ప్రజాజ్యోతి:** అవినీతి అక్రమాలు, నేరాలను నియంత్రించే క్రమంలో విజిలెన్స్ శాఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత టాస్కోర్స్ను ఏర్పాటు చేస్తే పారదర్శకత, ఉత్పాదకత రెండూ గణనీయంగా పెరుగుతాయని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్ లో శుక్రవారం ఉదయం నిర్వహించిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ఐదో రోజు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సమావేశానికి సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ అధ్యక్షత వహించారు. సజ్జనార్ మాట్లాడుతూ... "అవినీతి, అక్రమాలు తగ్గాలంటే వ్యవస్థల్లో మౌలిక మార్పులు అవసరం. లోపభూయిష్టమైన విధానాలు అక్రమాలకు దారితీస్తాయి. కాబట్టి వ్యవస్థను

మిగతా 2 లో...

## సింగరేణి తొలి మహిళా అధికారి బెర్నడేట్ నికోలస్ రిటైర్మెంట్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిది, అక్టోబర్ 31, ప్రజా జ్యోతి:** సింగరేణి చరిత్రలో తొలి మహిళా అధికారిగా గుర్తింపు పొందిన బెర్నడేట్ నికోలస్ అక్టోబర్ 31 న పదవి విరమణ పొందారు. 1990వ సంవత్సరంలో పర్సనల్ విభాగంలో తొలి మహిళ అధికారిగా చేరిన ఆమె, నేటి వరకు ఏ ఒక్క ఆరోపణ లేకుండా తన ఉద్యోగ జీవితాన్ని విశ్వసనీయంగా కొనసాగించడం ద్వారా సింగరేణి చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. మూడున్నర దశాబ్దాలపాటు సింగరేణిలోని పలు ఏరియాల్లో

మిగతా 2 లో...

## సర్దార్ వల్లభభాయ్ పటేల్ స్ఫూర్తితో

# యువత ముందుకు సాగాలి

- **గిరిజన యువతకు ఫర్నిచర్ తయారీ రంగంలో వృత్తి శిక్షణతో ఉపాధి అవకాశాలు**
- **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 31, ప్రజాజ్యోతి:** ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ ను స్ఫూర్తిగా తీసుకొని దేశ సమగ్రత, అభివృద్ధి దిశగా యువత కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 ఐక్యత పాదయాత్ర" కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను తెలియజేశారు, అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని, కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, మై భారత్ సంస్థ సమన్వయంతో దేశవ్యాప్తంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 ఐక్యత మార్చ్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. దేశ సమగ్రత, ప్రజాస్వామ్య విలువలు, దేశభక్తి భావనలను బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు రూపుదిద్దుకున్నాయని తెలిపారు. విద్యార్థులలో ఐక్యతా స్ఫూర్తి పెంపొందించేందుకు వ్యాసరచన, వాదవివాదాలు, సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో పార్లమెంట్ సభ్యులు,

మిగతా 2 లో...

## సింగరేణి తొలి మహిళా అధికారి బెర్నడేట్ నికోలస్ రిటైర్మెంట్



(మొదటి పేజీ తరువాయి...)
పనిచేసిన ఆమె, ప్రతిచోట వర్క్ మేనేజ్ మెంట్ లో సమర్థతను చాటారు. ముఖ్యంగా శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేసిన సమయంలో వందలాది కోర్టు కేసులు పెండింగ్ లో ఉండగా, వాటిలో 650 కేసులలో 610 కేసులను తక్షణ పరిష్కారం చేసి రికార్డు సృష్టించారు. ఈ కృషి ఆమెకు పరిపాలనా సమర్థతకు చిహ్నంగా నిలిచింది. తరువాత ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ బాధ్యతలు చేపట్టిన ఆమె, సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ అభివృద్ధికి దోహదం చేశారు. ముఖ్యంగా సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్ఈ పాఠ్య ప్రణాళిక ప్రవేశపెట్టడంలో ఆమె పాత్ర కీలకమైంది. విద్యా ప్రమాణాలను పెంచడంలో ఆమె చూపిన దృఢత సింగరేణి విద్యా రంగానికి కొత్త దిశ చూపింది. శుక్రవారం ఆమె రిటైర్మెంట్ సందర్భంగా సింగరేణి ఉద్యోగులు, అధికారులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆమె సేవలను గుర్తుచేసుకున్నారు. ఆమె పట్ల ఉన్న గౌరవం, అభిమానాన్ని వ్యక్తం చేస్తూ "సింగరేణిలో మహిళా సాధికారతకు నాంది పలికిన వ్యక్తి బెర్నడేట్ నికోలస్" అని పలువురు పేర్కొన్నారు. తన 35 సంవత్సరాల సేవలో నిబద్ధత, క్రమశిక్షణ, మానవతా దృక్పథం ఆమెను సహచరుల మనసుల్లో నిలబెట్టాయి. సింగరేణి కుటుంబానికి ఆమె చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయని ఉద్యోగులు అభిప్రాయపడ్డారు.

## ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలు





**ఇల్లందు, అక్టోబర్ 31, ప్రజాజ్యోతి:** స్వర్గీయ మాజీ మొదటి మహిళ ప్రధాని ఇందిరా గాంధీ 41వ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక ఇల్లందు టౌన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కూరగాయల మార్కెట్ వద్ద గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి, జగదాంబ సెంటర్ లోని ఇందిరా గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్యానికి ముందు ఇందిరా గాంధీ కుటుంబం స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని దేశానికి స్వాతంత్రం రావడంలో ముఖ్యపాత్ర పోషించారని కొనియాడారు. ఇందిరా గాంధీ కుటుంబం దేశం కోసం ప్రాణాలర్పించారని, స్వాతంత్రం అనంతరం దేశంలో ఎన్నో ప్రాజెక్టులు తీసుకొచ్చారని, దేశంలో గరీబీ హటావో అనే నినాదంతో పేద, బడుగు, బలహీన వర్గాలను ఉన్నత స్థాయికి తీసుకురావాలని ఎంతో కృషి చేసినటువంటి నాయకురాలు ఇందిరా గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు దొడ్డ డానియల్, పులి సైదులు, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, సీనియర్ నాయకులు మడుగు సాంబమూర్తి, మండల రాము, భోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్లు దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, యదల్లపల్లి అనసూయ, నాయకులు సుదర్శన్ కోరి, జాఫర్, జానీ, ఎట్టి హరికృష్ణ, ఆరేం కిరణ్, పరె శ్రీనివాస్, గాలిపల్లి స్వరూప, కమలమ్మ, సలీమ్, అంకెపాక నవీన్, అజమ్, యాకుబ్, సాతెళ్ల గిరి, వచ్చా వెంకన్న, ఇమామ్, పందిళ్ళ వెంకన్న, చిన్న శ్రీను, కమల్ కుమార్ కోరి తదితరులు పాల్గొన్నారు.

# విజిలెన్స్ లో కృత్రిమ మేథా టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేయాలి





(మొదటి పేజీ తరువాయి...)
పటిష్టపరచి, మంచి అలవాట్లు పద్ధతులను అమల్లోకి తేవాలి," అని పేర్కొన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. సింగరేణి సంస్థతో తనకు 25 సంవత్సరాల అనుబంధం ఉందని పాత జ్ఞాపకాలను గుర్తు చేశారు. నేడు దేశ జీడీపీ పెరుగుదలలో ప్రభుత్వ రంగ సంస్థల పాత్ర ఎంతో ఉందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ యువ సీఎండీ శ్రీ ఎన్ బలరామ్ సారథ్యంలో పలు వ్యాపార విస్తరణ చర్యల ద్వారా గ్లోబల్ కంపెనీగా రూపు దిద్దుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ దిశగా మరింత వేగంగా ఎదగాలి అని ఆయన తన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే, మార్పు స్వీకరించడంలో వెనుకబడ్డ అనేక కంపెనీలు మూతపడ్డాయని గుర్తుచేసి, సింగరేణి ఉద్యోగులు సవాళ్లను స్వీకరించి, తమ నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని సూచించారు. విజిలెన్స్ విభాగం ఇతర సంస్థల్లో అమలు చేస్తున్న మంచి పద్ధతులను స్వీకరించడం ద్వారా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. విజిలెన్స్ అంటే శిక్షించే శాఖ కాదు – సంస్కరించే శాఖగా రూపుదిద్దుకోవాలి – జి. శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ కమిషనర్, జీఎస్టీ రంగారెడ్డి కమిషనరేట్ విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించిన కార్యక్రమంలో మరొక ముఖ్యఅతిథిగా పాల్గొన్న జీఎస్టీ రంగారెడ్డి కమిషనరేట్ ప్రిన్సిపల్ కమిషనర్ శ్రీ. జి .శ్రీనివాసరావు మాట్లాడుతూ... నేటి ఆధునిక పరిస్థితుల్లో విజిలెన్స్ శాఖ అంటే శిక్షించే వ్యవస్థగా కాకుండా సంస్కరించే శాఖగా రూపు దిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతీ ఉద్యోగి చేయాల్సిన ప్రతీ కార్యకలాపాన్ని స్థిరంగా మరియు నిర్దేశిత ప్రమాణాల ప్రకారం ఎలా నిర్వహించాలో తెలిపే స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రోసీజర్సును రూపొందించాలని సూచించారు. దీనివల్ల పొరపాట్లు జరగడానికి అవకాశం ఉండదని, అలాగే అవినీతిని నిరోధించవచ్చని పేర్కొన్నారు. విజిలెన్స్ శాఖ అవినీతి అక్రమాలను అడ్డుకునే క్రమంలో అత్యుత్సాహంతో నిజాయతీగా పనిచేసే అధికారులను మాత్రం భయపెట్టకూడదని అభిప్రాయపడ్డారు. దీనివల్ల విజిలెన్స్ యొక్క అసలు లక్ష్యం పక్కదారి పడుతుందన్నారు. బాగా పనిచేసే అధికారులకు, ఉద్యోగులకు ప్రశంసలు అవసరమని, ఇవి వారు మరింత బాగా పనిచేయటానికి ఉపయోగపడతాయన్నారు. ఉద్యోగులకు తెలియకుండా పొరపాట్లు జరిగినప్పుడు వాటిని సరిదిద్దుకునే అవకాశాన్ని ఉద్యోగులకు కల్పించాలన్నారు. తాము పనిచేస్తున్న పనికి జీతం తప్ప వేరే ఇంకా ఏమీ ఆశించని స్థాయికి ఉద్యోగులు తమ ఆలోచనలు మార్చుకోవాలని, అప్పుడు విజిలెన్స్ శాఖ అవసరం ఉండదు అన్నారు. ప్రతీ ఉద్యోగి ప్రశాంతంగా తమ బాధ్యతలు నిర్వహించాలని, ప్రలోభాలకు లోను కాకూడదని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సింగరేణి సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ చేపడుతున్న వ్యాపార విస్తరణ చర్యలను వివరించారు. ఉద్యోగుల్లో క్రమశిక్షణ తీసుకురావడం కోసం, పని గంటల సద్వినియోగం కోసం ప్రత్యేక చొరవ చూపుతున్నామని, వ్యవస్థలను మరింత పటిష్ట పరిచేందుకు ఈసారి విజిలెన్స్ వారోత్సవాలలో ప్రముఖులను ఆహ్వానించి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో దేశంలోని 10 రాష్ట్రాల్లోనూ కార్యకలాపాలు నిర్వహించేలా, అలాగే అంతర్జాతీయంగా ఖనిజ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకునేలా విస్తరణ ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, తిరుమల రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూవ్ మెంట్ మరియు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి వెంకన్న, జీఎం(కో ఆర్డినేషన్) టి.శ్రీనివాస్, అన్ని ఏరియాల జీఎంలు, కార్పోరేట్ జీఎంలు, వివిధ విభాగాల అధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

# సర్దార్ వల్లభభాయ్ పటేల్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

(మొదటి పేజీ తరువాయి...)
ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారని కలెక్టర్ వెల్లడించారు. దేశ అభివృద్ధిలో యువత భాగస్వామ్యాన్ని పెంపొందించి, జాతీయ నాయకుల త్యాగాలకు ఘన నివాళి అర్పించడం ప్రధాన ఉద్దేశమని అన్నారు. యువతలో ఐక్యత, దేశ భక్తి, సామాజిక బాధ్యతా భావనలను పెంపొందించేందుకు ఈ దేశవ్యాప్త ఐక్యత పాదయాత్రలకు రూపకల్పన చేయబడిందని అన్నారు. జిల్లా స్థాయిలో నవంబర్ 1 నుండి 15 వరకు మూడు రోజుల పాటు ఐక్యత పాదయాత్రలు, ఆరోగ్య శిబిరాలు, సర్దార్ వల్లభభాయ్ పటేల్ జీవితం పై ప్రసంగాలు, "ఆత్మనిర్భర్ భారత్" ప్రతిజ్ఞలు, సర్టిఫికేట్ ప్రదానం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు ,ఈ కార్యక్రమాల్లో పాల్గొనదలచిన యువత https://mybharat.gov.in/pages/unity march వెబ్ సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా, నషాముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా యువత మత్తు పదార్థాల వ్యతిరేకంగా ముందుండాలని




అన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు జిల్లాలో ఇప్పటికే విస్తృత అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని. అనంతరం కలెక్టర్ జిల్లాలో విద్యార్థులు , యువకులను ప్రోత్సహించేందుకు చేపడుతున్న కార్యక్రమాలను వివరిస్తూ.. విద్యార్థుల్లో పర్యావరణ అవగాహన పెంపొందించేందుకు జిల్లాలో "విత్తన సేకరణ కార్యక్రమం" చేపట్టినట్లు తెలిపారు. అశ్వాపురం ఎంపీపీ పాఠశాల విద్యార్థులు 40 రకాలుగా 400 కిలోల విత్తనాలను సేకరించడం అభినందనీయమని . ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని పాఠశాలల్లో చేపట్టి, పర్యావరణ సంరక్షణకు విద్యార్థులను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. మారుమూల గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు హైదరాబాద్ లోని ఎన్ ఎస్టీ సంస్థ ద్వారా ఫర్నిచర్ తయారీ రంగంలో మూడు నెలల శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేసిన ఎనిమిది మంది యువకులు ప్రస్తుతం రూ.15 వేల వేతనంతో ఆరు నెలల అప్రెంటిస్ షిప్ పొందుతున్నారని కలెక్టర్ తెలిపారు, పదవ తరగతి ఉత్తీర్ణులైన 18 నుంచి 30 ఏళ్ల వయస్సు గల నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నవంబర్ 6వ తేదీ నుండి రెండవ విడత శిక్షణ కార్యక్రమానికి అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు , శిక్షణ సమయంలో వసతి, భోజనం, రిజిస్ట్రేషన్ సౌకర్యాలు ప్రైవేటు సంస్థల సహకారంతో ఉచితంగా కల్పించబడతాయని తెలిపారు. మొదటి విడతలో గిరిజన యువకులకు ప్రాధాన్యత ఇచ్చినట్లు, రెండవ విడతలో కూడా వారికి ప్రాధాన్యం ఇవ్వబడుతుందని, ఇతర అర్హులైన యువత కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వారికి కూడా విడతల వారీగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా యువత వృత్తి నైపుణ్యంతో స్వయం ఆధారంగా నిలబడి, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అదేవిధంగా జిల్లా ప్రజల ఆర్థిక అభివృద్ధికి చేపల పెంపకం, కౌజు పిట్టల పెంపకం వంటి యూనిట్లు ఫలితవంతంగా నడుస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి యూనిట్లను మరింత మంది స్థాపించి ఆర్థికంగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. అనంతరం ఐక్యత ర్యాలీ కి సంబంధించిన గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అన్వేష్ చింతల డిప్యూటీ డైరెక్టర్, మేరా యువభారత్, మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, జిల్లా క్రీడా శాఖ అధికారి పందమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగాలు ఎన్నటికి మరిచిపోలేము

- భద్రాచలం ఎఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్



**భద్రాచలం, అక్టోబర్ 31, ప్రజాజ్యోతి :** అమరవీరుల త్యాగాలు ఎన్నటికి మరిచిపోలేమని భద్రాచలం ఎఎస్పీ విక్రాంత కుమార్ సింగ్ అన్నారు. భద్రాచలంలో శుక్రవారం పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా మెగా రక్తదాన శిబిరంను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ రక్తదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ మర్చిపోలేమని, పోలీసుల సేవలను స్మరించుకుంటూ రక్తదానం చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివ నాయక్, సీఆర్పీఎఫ్ బెటాలియన్ జవాన్లు, పోలీసు సిబ్బంది, ఆటో యూనియన్ సభ్యులు, వికలాంగులు, బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, సిఐ నాగరాజు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, ఎస్ ఐలు సతీష్, శ్యామ్ ప్రసాద్, ట్రాఫిక్ తిరుపతి, మండల నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రామయ్యను దర్శించుకున్న రాష్ట్ర ఆదాయపన్ను శాఖ ప్రిన్సిపల్ కమీషనర్



**భద్రాచలం, అక్టోబర్ 31,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని రాష్ట్ర ఆదాయపన్ను శాఖ ప్రిన్సిపల్ కమీషనర్ ప్రభాత్ కుమార్ గుప్తా కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొనగా, వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అలాగే శ్రీ సీతారామచంద్రస్వామి వారు శుక్రవారం సందర్భంగా స్వర్ణభద్రవకచాలతో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది.

# ఘనంగా ఇందిరాగాంధీ వర్ధంతి వేడుక



**చర్ల, అక్టోబర్ 31 (ప్రజాజ్యోతి ):** చర్ల మండలంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాల య ంలో ఇందిరా గాంధీ 41వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్ ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు . ఈ కార్యక్రమం లో వారు మాట్లాడుతూ గరిబీ హటావో' నినాదంతో దేశంలోని పేదల ఆకలి తీర్చిన ఘనత స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరా గాంధీకే దక్కుతుందని అన్నారు ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సందర్భంలో మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేశారని ఇందిరా గాంధీ దేశ ప్రజలకు చేసిన సంక్షేమం సేవ అభివృద్ధి మరువలేనిది అని అన్నారు. ఈ కార్యక్రమంలో చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆవుల విజయభాస్కర్ రెడ్డి, మహిళా నాయకురాలు మాజీ ఎంపీటీసీ మడకం పద్మజ. ,మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావు, ఇందల బుచ్చిబాబు, పటేల్ వెంకటేశ్వర్లు, పొగాకు సత్తిబాబు, రెడ్డి, రంజిత్, సుధాకర్, నవీన్ ప్రసాద్, రాయుడు తదితరులు పాల్గొన్నారు..

# పదవి విరమణ పొందిన రోజే టెర్మినల్ బెనిఫిట్స్

- సిపిఆర్ఎంఎస్-ఎన్.ఈ హెల్త్ కార్డులను అందజేత



**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 31, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం ఉద్యోగుల సంక్షేమముకు అధిక ప్రాధాన్యత ఇస్తుంటారు. అందులో భాగంగా పదవి విరమణ పొందుతున్న ఉద్యోగులకు అదే నెలలో వారి యొక్క టర్మినల్ బెనిఫిట్స్ మరియు సిపిఆర్ఎంఎస్-ఎన్.ఈ హెల్త్ కార్డులను అందించాలనే వారి ఆదేశానుసారం సంస్థ డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రూ దిశ నిర్దేశాలతో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు ఆధ్వర్యంలో కొత్తగూడెం ఏరియా లో విధులు నిర్వహించి అక్టోబర్-2025 లో పదవి విరమణ పొందుతున్న 8 మంది ఉద్యోగులకు వారి టెర్మినల్ బెనిఫిట్స్ మరియు సిపిఆర్ఎంఎస్-ఎన్.ఈ హెల్త్ కార్డులను మొదటిసారిగా పదవి విరమణ పొందుతున్న వారికి ఇవ్వడం జరిగిందని అలాగే ఎనిమిది మంది లో టెర్మినల్ బెనిఫిట్ అయినా గ్రాడ్యుటి అమౌంటు నలుగురికి క్వార్టర్ ను కంపెనీ వారికి ఒప్పచెప్పినందున సెటిల్మెంట్ కొరకు కార్పొరేట్ విభాగానికి పంపించడం జరిగిందని అలాగే మిగిలిన నలుగురికి క్వార్టర్ ఉన్నందున వారు క్వార్టర్ ను కంపెనీ వారికి ఒప్పచెప్పిన వెంటనే వారి గ్రాడ్యుటి క్లైమ్ కూడా ఆలస్యం లేకుండా త్వరితిగతిన సెటిల్మెంట్ చేయడానికి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు , సిబ్బందికి జిఎం ఆదేశించారు. ఈ సందర్భంగా సిపిఆర్ఎంఎస్- ఎన్.ఈ హెల్త్ కార్డులను తీసుకున్న పదవీ విరమణ పొందబోతున్న ఉద్యోగులు చాలా సంతోషంతో పదవీ విరమణ పొందిన రోజే వారికి సిపిఆర్ఎంఎస్- ఎన్.ఈ హెల్త్ కార్డులను ఇవ్వడానికి సంబంధిత అధికారులకు సిబ్బందికి ఆదేశాలు జారీ చేసిన గౌరవనీయులు చైర్మన్ గారికి మరియు ఉన్నతాధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం జిఎంతో పాటు కొత్తగూడెం ఏరియా ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వి.మల్లికార్జునరావు, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి. రజాక్, డిజిఎం (పర్సనల్) జీవి మోహన్ రావు, మేనేజర్ పద్మావతి ఖని ఎం.వి.ఎన్. శ్యామ్ ప్రసాద్, డివై పిఎం జి. హరీష్, మజ్జి మురళి ఇతర సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# దెబ్బతిన్న పంటలను అధికారులతో పరిశీలించిన కూనంనేని



**కొత్తగూడెం అక్టోబర్ 31(ప్రజాజ్యోతి):** మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, వరదలతో వేలాది ఎకరాల పంటలు దెబ్బతిని రైతులు నష్టాలఊబిలో కూరుకుపోయారని, పంటలు నష్టపోయిన దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు అన్నారు. సుజాతనగర్ మండల పరిధిలోని పలుగ్రామాల్లో శుక్రవారం అయన పర్యటించి క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి జరిగిన నష్టాన్ని రైతులను అడిగి గెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ భారీ వర్షాలు, వదల కారణంగా జరిగిన పంటల నష్టంపై యుద్ధప్రాతిపదికన సర్వే చేపట్టి పూర్తి చేయాలనీ, నష్టనివేదికను ప్రభుత్వానికి అందించాలని ఆదేశించారు. జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం కోసం వత్తిడి తెస్తానని తెలిపారు. అప్పులుచేసి సాగుచేసిన రైతులకు తగిన ప్రతిఫలం దక్కకుండా ఆర్ధికంగా దెబ్బతిన్నారని, జరిగిన నష్టంపై కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు స్పందించి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, విద్యుత్ పునరుద్ధరణపనులు తక్షణమే పూర్తి చేయాలని, ఇండ్లు కోల్పోయి నిరాశ్రయులైన పేదలకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపిడివో భారతి, వ్యవసాయశాఖ అధికారిని నర్మదా, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, మండె హన్మంతరావు, సిపిఐ జిల్లా నాయకులు సలిగంటి శ్రీనివాస్, భూక్యా దస్రు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు తదితరులు పాల్గొన్నారు.

# జనరల్ మేనేజర్‌గా మురళీధర్‌రావు పదోన్నతి



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, అక్టోబర్ 31, ప్రజా జ్యోతి;** సింగరేణి సంస్థలో విశ్వసనీయ అధికారిగా గుర్తింపు పొందిన పర్సనల్ విభాగాధికారి ఎజెయం. మురళీధర్‌రావు జనరల్ మేనేజర్ (జీఎం)గా పదోన్నతి పొందారు. 1996వ సంవత్సరంలో పర్సనల్ విభాగంలో అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆయన, గత మూడు దశాబ్దాలుగా సంభందిత విభాగంలో కీలక పాత్ర పోషించారు. సింగరేణి లోని పలు ఏరియాల్లో సేవలందించిన ఆయన, తనదైన పరిపాలనా శైలితో గుర్తింపు తెచ్చుకున్నారు. పర్సనల్ మేనేజ్‌మెంట్‌లో.. పారదర్శకత, క్రమశిక్షణ, సిబ్బందితో సమన్వయం వంటి అంశాల్లో ఆయన చూపిన సమర్ధతకు సంస్థ అంతటా మంచి పేరు ఉంది. సింగరేణి సేవలతో పాటు పలు కేంద్ర రాష్ట్రాలకు ఆయన సేవలందించారు. ఈఎస్ఐసీ (ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్)లో హర్యానా రాష్ట్రానికి అడిషనల్ కమిషనర్ మరియు రీజినల్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. అదనంగా పంజాబ్, చండీగఢ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, ఢిల్లీ రీజినల్ ఆఫీస్‌లకు కూడా బాధ్యతలు నిర్వహించగా, ఈఎస్ఐసీ హెడ్‌క్వార్టర్స్‌లోని పర్సనల్ విభాగంలో ఒక సెక్షన్‌కు అడిషనల్ కమిషనర్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించి అనుభవాన్ని సంతరించుకున్నారు. అనంతరం తిరిగి సింగరేణి సేవలకు చేరి ఏజీఎం హోదాలో కీలకమైన ఈఈ (ఎగ్జిక్యూటివ్ ఎస్టాబ్లిష్మెంట్ ) సెల్ హెచ్‌ఓడిగా పని చేస్తున్నారు. తాజాగా యాజమాన్యం ఆయన ప్రతిభ, నిబద్ధతను గుర్తించి జీఎం పదవికి పదోన్నతి కల్పించింది. అదే సమయంలో శుక్రవారం సేవా విరమణ పొందిన బెర్నడేట్ నికోలస్ బాధ్యతలు ఉన్న ఆర్సీసెల్ విభాగానికి కూడా అదనపు బాధ్యతలు ఆయనకు అప్పగించారు. ఈ పదోన్నతిని సింగరేణి ఉద్యోగులు, అధికారులు సంతోషంగా స్వాగతించారు. “సంస్థలో దీర్ఘకాలిక సేవలతో తన ప్రతిభను నిరూపించుకున్న మురళీధర్‌రావు జీఎం పదవికి పూర్తిగా అర్హుడు” అని పలువురు సహచరులు పేర్కొన్నారు

# ఉద్యోగుల పిల్లలకు ఫీజు రియంబర్స్మెంట్ చెక్కులు అందజేత



**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 31 ప్రజాజ్యోతి:** కొత్తగూడెం ఏరియాలోని జె.వి.ఆర్ ఓసి నందు హెడ్ ఓవర్ మెన్ గా పనిచేయుచున్న విజయగిరి శ్రీనివాస్ కుమారుడు విజయగిరి సంతోష్ ఐఐటి ముంబై నందు కెమికల్ ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం విద్యను అభ్యసించుచున్నాడు. అతనికి ఈ సంవత్సరముకు గాను లక్ష రూపాయల చెక్కును కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలెం రాజు శుక్రవారం న కొత్తగూడెం ఏరియా జిఎం కార్యాలయం నందు అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ... ఉద్యోగుల పిల్లల ఉన్నత విద్యలు అభ్యసించుటకు సింగరేణి సంస్థ అందిస్తున్న సేవలను కొనియాడారు. మరి ముఖ్యంగా ఈరోజు చెక్కులు తీసుకుంటున్న విజయగిరి శ్రీనివాస్ కు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ సింగరేణిలో పనిచేయుచున్న ఉద్యోగుల పిల్లలు వీరిని ఆదర్శంగా, స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత చదువులను అభ్యసించి, ఉన్నత శిఖరాలను అవరోదించాలని ఈ సందర్భంగా పత్రిక ప్రకటన ద్వారా కొత్తగూడెం ఏరియా ఉద్యోగులందరికీ తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం జిఎంతో పాటు కొత్తగూడెం ఏరియా ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వి.మల్లికార్జునరావు, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి. రజాక్, డిజిఎం (పర్సనల్) జీవి మోహన్ రావు, మేనేజర్ పద్మావతి ఖని ఎం.వి.ఎన్. శ్యామ్ ప్రసాద్, డివై పిఎం జి. హరీష్, సీనియర్ పిఓ మజ్జి మురళి ఇతర సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## పదవి విరమణ చేసిన జూనియర్ అసిస్టెంట్ దార్ల పుల్లయ్యకు ఘన సన్మానం



**భద్రాచలం, అక్టోబర్ 31, ప్రజాజ్యోతి :** భద్రాచలం తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న దార్ల పుల్లయ్య శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు ఆయనకు ఘన సన్మానం నిర్వహించారు.సుమారు 30 ఏళ్లపాటు రెవెన్యూ శాఖలో సేవలందించిన పుల్లయ్య అందరితో స్నేహపూర్వకంగా చెలిమి కొనసాగించారని తహసీల్దార్ ప్రసంశించారు. ఇక ముందు జీవితం సుఖసంతోషాలతో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో డీటీ వినయ్ శీల, గిరిధర్ నాగేంద్ర ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ వరలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి.

- దేశ ఐక్యతకు స్ఫూర్తి అయిన సర్దార్ పటేల్ – ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ అరుణకుమారి




**పాల్వంచ (రూరల్), అక్టోబర్ 31 (ప్రజాజ్యోతి):** భారత దేశ ఐక్యతకు ప్రతీకగా పేరుగాంచిన సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల,పాల్వంచలో ఇన్చార్జి ప్రిన్సిపల్ మరియు ఎన్ఎస్ఎస్,ఎన్సిసి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సమావేశానికి అధ్యక్షత వహించిన ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ టి. అరుణకుమారి మాట్లాడుతూ, స్వాతంత్ర్యం అనంతరం భారతదేశాన్ని ఒకే జెండా కింద ఏకీకృతం చేయడంలో సర్దార్ పటేల్ పాత్ర అపారమని తెలిపారు.ఆయన దూరదృష్టి,దేశభక్తి, నాయకత్వ గుణాలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తదనంతరం ఇన్చార్జి పి.డి.పొట్ల పువ్వు శ్రీనివాసరావు విద్యార్థులతో ఐక్యత ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.శ్రీదేవి మాట్లాడుతూ,సర్దార్ వల్లభభాయ్ పటేల్ స్ఫూర్తితో దేశ ఐక్యత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ధర్మారావు,అధ్యాపకులు డి.రమేష్, పారెల్లి శ్రీనివాస్, కోటగిరి రాంబాబు, డాక్టర్ తేజవత్ రమేష్, డాక్టర్ పవన్ బాబ్జి, బి.రమేష్, కరీమా, విమల, హారిక, దీపిక, తేజస్విని తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని దేశభక్తి నినాదాలతో కళాశాల ప్రాంగణాన్ని మార్మోగించారు.

## నూతన ఎస్సై విజయసింహారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన జర్నలిస్టులు



**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 31, ప్రజాజ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన విజయసింహారెడ్డిని శుక్రవారం స్థానిక టిడబ్ల్యూజేఏఫ్ ప్రెస్ క్లబ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కుంజా వెంకటేష్ మాట్లాడుతూ, పోలీసు–ప్రెస్ సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు. నూతన ఎస్సై విజయసింహారెడ్డి బాధ్యతలు విజయవంతంగా నిర్వర్తించాలని ప్రెస్ క్లబ్ పక్షాన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వీర రాఘవులు, సభ్యులు గుడిమెట్ల రమేష్, ఆకుల శివ, నున్న బుజ్జి కృష్ణ, దారా ప్రవీణ్, కూరం సురేష్, వీరబోయిన సీతారాంబాబు, వేముల రాకేష్, అర్జున్ ప్రసాద్, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా 'జాతీయ ఐక్యతా దినోత్సవం'

- భారతరత్న సర్దార్ వల్లభాయి పటేల్ కృషి తోనే సమగ్ర భారత దేశం
- సింగరేణి డైరక్టర్(పి&పి) కె.వెంకటేశ్వర్లు




**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 31 – ప్రజాజ్యోతి:** కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భారత దేశ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ రంగ సంస్థలలో భారతరత్న సర్దార్ వల్లభాయి పటేల్ జన్మదినం సందర్భంగా నిర్వహించుకునే "జాతీయ ఐక్యతా దినోత్సవ" కార్యక్రమాన్ని ఈ రోజు సింగరేణి ప్రధాన కార్యాలయము లోని హెచ్ఆర్‌డి కాన్ఫరెన్స్ హాల్ వద్ద జరుపుకోవటం జరిగినది. జిఎం(పర్సనల్) వెల్ఫేర్ & సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సంస్థ డైరక్టర్ (పి&పి) కె. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరక్టర్(పి&పి) కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... 2014 నుండి ప్రతీ సంవత్సరం అక్టోబర్–31 న భారత దేశ తొలి హోంమంత్రి, ఉప ప్రధాని గౌరవ భారత రత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందని, కార్పొరేట్ కార్యలయం లో మాత్రమే కాకుండా సింగరేణి వ్యాప్తముగా కూడా ఈ "జాతీయ ఐక్యతా దినోత్సవ" వేడుకలను జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ సంవత్సరం దేశ వ్యాప్తముగా సర్దార్ వల్లభాయ్ పటేల్150 వ జయంతి వేడుకలను "ఏక్ భారత్, ఆత్మనిర్భర్ భారత్" అనే థీమ్ తో ఘనముగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. స్వాతంత్ర్యం రాక ముందు మన దేశం అనేక సంస్థానాలుగా ఉండేదని, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయి పటేల్ కృషి వల్లనే స్వాతంత్ర్యానంతరం అన్ని సంస్థానాల విలీనం జరిగి సమగ్ర భారత దేశం అవతరించిందని అన్నారు. ఐకమత్యంతో జాతి మత విభేదాలు లేకుండా ఉంటే ఏదైనా సాధించవచ్చని, రాష్ట్రాన్ని దేశాన్ని కూడా కాపాడుకోవటంతో పాటు దేశాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించటమే ఈ "జాతీయ ఐక్యతా దినోత్సవ" ముఖ్య ఉద్దేశం అని అన్నారు. గౌరవ భారత రత్న సర్దార్ వల్లభాయి పటేల్ స్ఫూర్తి తో ఐకమత్యం తో అన్నీ కార్మిక సంఘాలు, అధికారులు, కార్మికులు ఒకే కుటుంబంలా పని చేసినట్లయితే మన సంస్థ కూడా రక్షణతో ఉత్పత్తి మరియు ఉత్పాదకతను పెంచుకొని మరిన్ని లాభాలను సాధిస్తుంది అని తెలిపారు. అనంతరం భారత దేశ తొలి హోంమంత్రి మరియు ఉప ప్రధాని గౌరవ భారత రత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ముఖ్య అతిధులు, జనరల్ మేనేజర్లు, శాఖాధిపతులు, అధికారులు మరియు ఉద్యోగులు ఆయన చిత్రపటానికి ఘనంగా పూలమాలలతో ఘన నివాళులు అర్పించారు. అనంతరం డివై.పిఎం కే.శివ కుమార్ సమగ్రతా ప్రతిజ్ఞ ను ఉద్యోగులతో చేయించారు. జిఎం(పర్సనల్) వెల్ఫేర్ & సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమములో డైరక్టర్( పి& పి) కే. వెంకటేశ్వర్లుతో పాటు, గుర్తింపు సంఘం (ఏఐటియూసి) ఆసిస్టంట్ బ్రాంచ్ సెక్రెటరీ ఎస్.రాము, ప్రాతినిధ్య సంఘం (ఐఎన్‌టియూసి) కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ పీతాంబర రావు, కార్పొరేట్ సిఎంఓఏఐ ప్రెసిడెంట్ ఎస్.వెంకటాచారి, కార్పోరేట్ లోని వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు అధికారులు, ఉద్యోగులు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

## ఏడుగురు మావోయిస్టులు అరెస్ట్





**చర్ల, అక్టోబర్ 31: (ప్రజా జ్యోతి ):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ బీజాపూర్ జిల్లా లో శుక్రవారం ఉసూర్ ఇల్మిడి పోలీస్ స్టేషన్ల వేర్వేరు ఆపరేషన్లలో ఏడుగురు మావోయిస్టులను అరెస్టు చేసారు . పోలీసు ఇన్ఫార్మర్లుగా అనుమానించి గ్రామస్తుల హత్య లో వారు పాల్గొన్నారు. ఉసూర్ పోలీస్ స్టేషన్, ఇల్మిడి, ఛత్తీస్‌గఢ్ 9వ బెటాలియన్, సి ఆర్ పీ ఎఫ్ 196, 229 కోబ్రా 205 సంయుక్త ఆపరేషన్ లో ఉసూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదుగురు మావోయిస్టులు అరెస్టు చేసారు. అక్టోబర్ ఒకటిన, ఉసూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పూజారికాంకేర్ నివాసి భీమా మడ్కామ్‌ను మావోయిస్టులు పోలీసు ఇన్ఫార్మర్ అనే ఆరోపణతో టాంగియా కత్తితో దారుణంగా హత్య చేశారు. ఉస్సూర్ పోలీస్ స్టేషన్, సి ఆర్ పీ ఎఫ్ 196, 229 కోబ్రా 205 సంయుక్త బృందం తీసుకున్న చర్యలో ఈ సంఘటనలో పాల్గొన్న ఐదుగురు మావోయిస్టులను న అరెస్టు చేశారు. వారి పేర్లు రెంగా పిడ్గా అలియాస్ గుండం, హద్మా కాకా, శంకర్ ఎసామ్ అలియాస్ గోలెం, మడ్కం బుద్ర , సోది అండ, బీజాపూర్‌లో అరెస్టు చేసిన నిందితుల నుండి ఈ సంఘటనలో ఉపయోగించిన పదునైన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇల్మిడి పోలీస్ స్టేషన్ ద్వారా ఆపరేషన్ ఇద్దరు మావోయిస్టుల అరెస్టు చేసారు ఇల్మిడి ప్రాంతంలో ముజల్కంకేర్ నివాసి సత్యం పూనం (దివంగత బాలయ్య పూనం తండ్రి, 40 సంవత్సరాలు ) ను మావోయిస్టులు పోలీస్ ఇన్ఫార్మర్ అనే అనుమానంతో దారుణంగా హత్య చేశారు. సమాచారం ఆధారంగా ఇల్మిడి పోలీస్ స్టేషన్ సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్ 9వ బెటాలియన్ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ముజల్కంకేర్ నుండి ఇద్దరు మావోయిస్టులను అరెస్టు చేశారు. వారి వివరాలు మహేంద్ర మిచ్చా ఇల్మిడి , లక్ష్మణ్ కుర్సామ్, బీజాపూర్ జిల్లా ఉస్సూర్ ,ఇల్మిడి పోలీస్ స్టేషన్లలో అరెస్టు చేసిన మావోయిస్టులను అవసరమైన చట్టపరమైన చర్యల తర్వాత వారిని గౌరవనీయ కోర్టు ముందు హాజరుపరిచారు.

## పీవీకే 5. మైన్ లో పదవి విరమణ కార్యక్రమం

- పాల్గొన్న వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్





**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 31, ప్రజాజ్యోతి:** పీవీకే 5గనిలో సుదీర్ఘ కాలం పనిచేసి రిటైర్మెంట్ అయిన కార్మికులు కన్నయ్య బ్యాంక్స్ మెన్, అక్తర్ పాషా సన్మాన కార్యక్రమంలో గనిమేనేజర్ శ్యామ్ ప్రసాద్ మరియు ఐ ఎన్ టీ యు సి వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్ పాల్గొన్నారు.రిటైర్మెంట్ అవుతున్న కార్మికులకు ఎండీ రజాక్ ఆధ్వర్యంలో ఐ ఎన్ టీ యు సి యూనియన్ తరుపున ఘనంగా సన్మానించడం జరిగినది. ఈ సందర్భంగా ఎండీ రజాక్ మాట్లాడుతూ సింగరేణి కంపెనీలో సుదీర్ఘ కాలం పనిచేసి ఈ రోజు రిటైర్డ్ మెంట్ అవుతున్న కార్మికులు శేష జీవితం ఆయురారోగ్యాలతో తో జీవించాలని ఆకాంక్షంచారు.ఈ కార్యక్రమం లో పాల్గొన్నవారు.డిప్యూటీ జనరల్ సెక్రటరీ బూటుక రాజేశ్వరరావు, సీతారామరాజు, చిలక రాజయ్య,టీ నాగార్జున, వి రాహుల్, నామాల శ్రీనివాస్, భూక్య శ్రీరామ్ వల్లలా. సాంబమూర్తి, కొమ్ము సాంబయ్య, ఎన్ శంకర్, వై శంకర్,హుస్సేన్, అఖిల్, రామ్మోహన్, గట్టు శ్రీనివాస్, సాయి సూర్య తేజ పల్గిన్నారు.

# ఎస్.ఐ.ఆర్ సన్నాహక ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

- **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 31, ప్రజాజ్యోతి:** జిల్లాలో ప్రత్యేక ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) సన్నాహక ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్దిష్ట గడువులోపు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా అసిస్టెంట్ ఎలక్షన్ రిజిస్టరింగ్ ఆఫీసర్లు, బూత్ లెవల్ ఆఫీసర్లు , బిఎల్ఓ సూపర్వైజర్లతో ఎస్.ఐ.ఆర్ పూర్వ సన్నాహక ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్.ఐ.ఆర్ సన్నాహక ప్రక్రియను పారదర్శకంగా, తప్పిదాలకు తావు లేకుండా నిర్వహించాలని, నిర్దిష్ట రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో బిఎల్ఓలు బాధ్యతాయుతంగా పని చేసి, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో తప్పకుండా ఉండేలా నిశిత పరిశీలన జరపాలని సూచించారు. 2002 సంవత్సరపు ఓటరు జాబితాను 2025సంవత్సరం జాబితాతో మ్యాపింగ్ చేసి నాలుగు కేటగిరీలుగా విభజించినట్లు గుర్తు చేశారు. ముందుగా మ్యాపింగ్ చేయబడిన కేటగిరి 'ఏ' జాబితాను బిఎల్ఓ యాప్ ద్వారా ధృవీకరించి, అది ఎన్నికల సంఘం పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం కేటగిరీ 'సి' ,కేటగిరీ 'డి' లోని ఓటర్లను 'ఏ' కేటగిరీకి మ్యాపింగ్ చేసే ప్రక్రియను ఎఇఆర్ఓల ఆధ్వర్యంలో బిఎల్ఓ సూపర్వైజర్లు, బిఎల్ఓలు బిఎల్ఓ యాప్ ద్వారా పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా, ప్రజా పాలన రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన సాదా బైనామా, అసైన్డ్ భూముల పెండింగ్ దరఖాస్తులను నవంబర్ 3వ తేదీ లోపు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజు పరిష్కరించిన దరఖాస్తులపై వివరాలను నివేదిక రూపంలో సమర్పించాలనీ, తిరస్కరించిన దరఖాస్తులపై తగిన కారణాలను స్పష్టంగా నమోదు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

# భద్రాచలం లో 56 లీటర్ల నాటు సారాయి పట్టివేత



**భద్రాచలం, అక్టోబర్ 31,ప్రజాజ్యోతి :** ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జి. జనార్ధన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ జి. గణేష్, ఏఈఎస్ కె. తిరుపతి ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్ఐ చంద్రశ్రీహరి రావు నేతృత్వంలో సిబ్బంది శుక్రవారం భద్రాచలం గోదావరి వంతెన సమీపంలోని అటవీ తనిఖీచోట వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వచ్చిన యమహా ఫాసినో ద్విచక్రవాహనం ను ఆపి తనిఖీ చేయగా, అందులో 56 లీటర్ల నాటు సారాయి లభ్యమైంది. ఏడుగురాళ్లపల్లి నుండి పాల్వంచకు అక్రమంగా తరలిస్తున్న పాల్వంచకు చెందిన గంగా కబాసి, సింగా కుర్మీ అనే ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. పట్టుబడిన నాటు సారాయి, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని, ఇద్దరు ముద్దాయిలను భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్ కు తరలించినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు కరీం, బాలు, కానిస్టేబుళ్లు సుధీర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు

# రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం

## చర్ల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో టుకే రన్






**చర్ల, అక్టోబర్ 31, (ప్రజాజ్యోతి):** చర్ల మండలంలో శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రన్ ఫర్ యూనిటీ టుకె రన్ కార్యక్రమాన్ని చర్ల మండల సిఐ రాజవర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ టుకె రన్ కార్యక్రమం చర్ల ఆయిల్ బంక్ ఏరియా మీదగా అంబేద్కర్ సెంటర్, బస్టాండు, గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా చర్ల మండల పోలీస్ స్టేషన్ కి చేరుకున్నది.ఈ టుకే రన్ లో యువత మండల వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్ల పోలీస్ స్టేషన్లో ఏక్తా దివస్ లో పాల్గొన్న యువతకు వ్యాయామలను చేయించారు . ఈ సందర్భంగా చర్ల మండల సిఐ రాజు వర్మ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ మన దేశానికి మొట్టమొదటి హోంమంత్రి అని అక్టోబర్ 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని రన్ ఫర్ యూనిటీ టుకే రన్ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ సమగ్రతకు నిలువెత్తు రూపమన్నారు. వల్లభాయ్ పటేల్ హైదరాబాద్ ని భారత దేశంలో కలిపారని భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత హైదరాబాద్ ను నిజాం స్వతంత్రంగా ఉండాలని ప్రయత్నించినప్పుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి ద్వారా హైదరాబాద్‌ను భారత యూనియన్‌లో చేర్చారు అని స్వాతంత్ర సమరయోధుల గురించి గొప్ప వ్యక్తుల గురించి అందరూ తెలుసుకోవాలని నేటి యువతే రేపటి భవిష్యత్తు అని వారు నాడు చూపిన చొరవ త్యాగాల వలన ఈనాడు మనం ప్రశాంతంగా ఉంటున్నామని అన్నారు.ఈ సందర్భగా చర్ల ఎస్ ఐ కేశవ్ మాట్లాడుతూ 560 ముక్కలైన దేశాన్నిఒక్కటి చేసిన గొప్ప వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని వన్ నేషన్ ని పటేల్ మనకు అందించిన ఇచ్చిన వరం అని యూనిటీ ఆఫ్ డైవర్సిటీ అంటూ వల్లభాయ్ పటేల్ ఇచ్చిన సందేశం స్వతంత్ర భారతదేశ నిర్మాణంలో వల్లభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని వందలాది స్వదేశీ సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి దేశాన్ని ఒకే తాటిపైకి తీసుకురావడంలో ఆయన కృషి ఎప్పటికీ మరువలేనివన్నారు. పటేల్ కారణంగానే నేడు మనం చూస్తున్న సమగ్ర భారత దేశం సాధ్యమైందని వెల్లడించారు. ఆయన కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదని ఉక్కు మనిషి అని దేశభక్తికి, త్యాగం, అంకితభావానికి నిలువెత్తు నిదర్శనమని ప్రజలందరినీ ఐక్యంగా ఉంచాలనే ఆయన ఆశయం నేటికీ మనందరికీ స్ఫూర్తినిస్తుందని చెప్పారు. 'రన్ ఫర్ యూనిటీ' ద్వారా సర్దార్ పటేల్ ఆశయాలను స్మరించుకుంటూ మన దేశ సమగ్రతను ఐక్యతను పెంపొందించాల్సిన అవసరాన్ని గుర్తుచేసుకుందామని తెలిపారు. ఈ సందర్భగా సి ఆర్ పీ ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వివేక్ రంజన్ మాట్లాడుతూ ఈ టూకె రన్‌లో పాల్గొనడం ద్వారా మనం సర్దార్ వల్లభాయ్ పటేల్ ను గౌరవించడమే కాకుండా భవిష్యత్ తరాలకు ఐక్యతా సందేశాన్ని అందిద్దామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చర్ల సీఐ రాజు వర్మ ,ఎస్ఐ నర్సిరెడ్డి, ఎస్ఐ కేశవ్, సిఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వివేక రంజన్, మండలవాసులు , విద్యార్థులు , పోలీస్ సిబ్బంది,పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ వేడుకలు

- **కార్పొరేట్ శక్తులను తరిమికొడితేనే కార్మికవర్గానికి మనుగడ – సిపిఐ నాయకులు**



**పాల్వంచ(రూరల్), అక్టోబర్ 31 (ప్రజా జ్యోతి):** దేశంలో కార్పొరేట్ శక్తులను, పెట్టుబడిదారులను తరిమికొడితేనే కార్మిక వర్గానికి,ప్రభుత్వ రంగ సంస్థలకు మనుగడ ఉంటుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్ పేర్కొన్నారు. ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పాల్వంచ పట్టణంలోని భవన నిర్మాణ,మున్సిపల్,పెయింటర్స్, హమాలీ,ఫుట్ పాత్ కార్మికుల అడ్డాలు,అమరవీరుల స్మారక స్థూపాలు, సీపీఐ కార్యాలయాలలో ఏఐటీయూసీ జెండాలు ఆవిష్కరించారు.అనంతరం జరిగిన ఆవిర్భావ సదస్సులో మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ,కార్పొరేట్ యజమానులకు అనుకూలంగా మార్చి శ్రామిక వర్గానికి తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడులుగా చేసి హక్కులను హరిస్తోందని,ప్రభుత్వ రంగంలోని రైల్వే, బీఎస్ఎన్ఎల్, భీమా, విమానయాన తదితర సంస్థలను చౌకగా కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నదని తెలిపారు.ఈ విధానాలతో లక్షలాది కార్మికులు, ఉద్యోగులు నిరుద్యోగులుగా మారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం ప్రజల సంక్షేమం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఆదాని,అంబానీల వంటి కుబేరులను మరింత ధనవంతులను చేస్తోందని ఆరోపించారు.కనీస వేతనం ₹18,000 చెల్లించాలని, మూతపడిన పరిశ్రమలను తిరిగి ప్రారంభించాలని,సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కాంట్రాక్టు విధానం రద్దు చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బ్రిటిష్ పాలనలో ట్రేడ్ యూనియన్ ఏర్పాటు నిషేధం ఉన్న కాలంలోనే ఏఐటీయూసీ ధైర్యంగా పోరాడి 1926లో ట్రేడ్ యూనియన్ చట్టంను సాధించిందని,కార్మికులు అనుభవిస్తున్న ప్రతి హక్కు వెనుక ఏఐటీయూసీ పోరాటం ఉందని గుర్తుచేశారు.గత 106 ఏళ్లుగా కార్మికుల అండగా నిలిచిన ఏఐటీయూసీ,భవిష్యత్తులో కూడా కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు డి.సుధాకర్,వీసంశెట్టి విశ్వేశ్వర రావు,నరహరి నాగేశ్వరరావు,అన్నారపు వెంకటేశ్వర్లు,ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు, మహిళా సమాఖ్య జిల్లా నాయకులు వీ.పద్మజ,నాయకులు డి.చెన్నయ్య, వైఎస్.గిరి, బిక్కులాల్, కోరే కృష్ణ, శెట్టి చేరాలు, జి.రవి, వెంకన్న, కృష్ణ, అల్లి వెంకటేశ్వర్లు, సర్వయ్య, బిల్లా రంగయ్య, రాము, వెంకట్, బాబు, మహేష్, వెంకన్న, కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# హత్యా రాజకీయాలతో సీపీఎంను అడ్డుకోలేరు

- **సామినేని రామారావును హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి**
- **సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు**

**కొత్తగూడెం, అక్టోబర్ 31(ప్రజాజ్యోతి ):**హత్యా రాజకీయాలతో సిపిఎం ఎదుగుదలను అడ్డుకోలేరనీ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు అన్నారు. సిపిఎం రాష్ట్ర నాయకులు సామినేని రామారావు హత్యను సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించారు.స్థానిక మంచికంటి భవన్లో అమరజీవి సామినేని రామారావు సంతాప కార్యక్రమం నిర్వహించారు.ముందుగా రామారావు చిత్రపటానికి బాలరాజు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానివాసి రైతు సంఘం రాష్ట్ర నాయకుడు, సిపిఎం సీనియర్ నేత కామ్రేడ్ సామినేని రామారావు దారుణ హత్యకు గురైనారన్నారు.హత్యా రాజకీయాలను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో ప్రశాంతంగా రాజకీయాలు కొనసాగుతున్న నేపథ్యంలో రానున్న స్థానిక ఎన్నికల్లో సిపిఎంను ఎదుర్కోలేక కాంగ్రెస్ అనుచరులు పక్కా ప్లాన్ ప్రకారం హత్యకు పాల్పడ్డారని ఆయన విమర్శించారు.హత్యలతో సిపిఎం విప్లవ రాజకీయాలను అడ్డుకోలేరన్నారు.సిపిఎం ఎదుగుదలను అడ్డుకావాలని చూసి కుట్రలు,కుయుక్తులు పన్నిన వారు కాలగర్భంలో కలిసిపోయారని విమర్శించారు.దుండగులు రామారావుని మాత్రమే చంపగలరని ఆయన ఆశయాన్ని చంపలేరనీ అన్నారు.వీరుల అమరత్వంతో ఎర్రజెండా అప్రతిహతంగా ముందుకే మున్ముందుకే పోతుందని



స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు సందకూరి లక్ష్మి టౌన్ కమిటీ సభ్యులు నాగకృష్ణ,అన్నవరపు ఇందిర, వుగ్గం కోటేశ్వరరావు సతీష్,సలీం, బాలకృష్ణ, రాములు, రఘు, రసూల్ బి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల నిలయంగా ఏకలవ్యలు

- విద్యార్థుల పరిస్థితి అయోమయం... ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్



**ములకలపల్లి అక్టోబర్ 31 ప్రజాజ్యోతి:** మండలంలోని మూకమామిడి గ్రామంలో గల ఈ ఎమ్ ఆర్ ఎస్ ఏకలవ్య మోడల్ పాఠశాలలో విద్యార్థులు సమస్యలతో సతమతమవుతూ గత మూడు రోజుల నుంచి మంచినీటి సౌకర్యం లేక అవస్థలు పడుతున్న పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు స్పందించకుండా విద్యార్థుల్ని అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని కనీసం విద్యార్థులు తమ కాల కృత్యాలను వెళ్ళడానికి కూడా నీటి సౌకర్యం లేక అనేక ఇబ్బందులు గురవుతున్నారని ప్రతిష్టాత్మకంగా కొన్ని కోట్ల రూపాయలను వెచ్చించి విశాలాంతమైన ప్రాంతంలో నూతన బిల్డింగ్ నిర్మించిన కనీస వసతులు లేకుండా ఒక నిర్దిష్టమైన ప్రణాళిక లేకుండా ఏకలవ్య పాఠశాల నిర్మించి విద్యార్థులను ఇబ్బందులు గురి చేస్తున్న పట్టించుకునే నాధుడే లేడని భాష రాణి ఉపాధ్యాయులుగా నార్త్ ఇండియా నుంచి నియమించి తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతి విధానాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిస్థితులు ఇక్కడ ప్రజల జీవన విధానాన్ని ఇక్కడ విద్యార్థుల యొక్క భాషా నైపుణ్యాన్ని తెలుసుకోకుండానే కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై రాష్ట్రప్రభుత్వం దృష్టిసాధించాలని ఏకలవ్యాల్లో ఒక నిర్దిష్టమైన ప్రణాళికను దానికి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని ములకలపల్లి మండల లో గల ఏకలవ్య పాఠశాల ఉపాధ్యాయుల యొక్క తీరు చాలా ఇబ్బందికరమైన వాతావరణంగా చదువుని చెప్పాల్సినటువంటి గురువులే గిరిజన విద్యార్థులని చిన్నచూపు చూస్తూ వాళ్ల తల్లిదండ్రులను సైతం అవమాన పరుస్తూ వ్యవహరిస్తున్నటువంటి ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలని ఏకలవ్యలో ఉన్నత అధికారి ఆర్ సి ఓ అరుణ కుమారి గారు స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొనిపోయి తెలంగాణలో ఉన్నటువంటి 23 ఏకలవ్యాల్లో హిందీ ఇంగ్లీష్ భాష నైపుణ్యం ఉన్న స్థానిక ఉపాధ్యాయుల్ని నియమించాలని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఏకలవ్యయాలలో ఒక నిర్దిష్టమైన ప్రణాళిక వివరణను రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకి పంపించాలని విద్యార్థుల జీవితాలతో చెలగాటాలు ఆడోద్దని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను అజిత్ డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మనోజ్ సన్నీ బన్నీ వికాస్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ పల్టీ యువకుడు మృతి





**ములకలపల్లి,అక్టోబర్ 31, ప్రజాజ్యోతి :** ట్రాక్టర్ బోల్తాపడటంతో యువకుడు ఘటనా స్థలంలోనే మృతి చెందిన విషాద సంఘటన శుక్రవారం మండలంలోని కమలాపురం క్రాస్ రోడ్డు వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని చలన్ నగర్ గ్రామానికి చెందిన వలస ఆదివాసీ మడకం చిన్నసోమయ్య (30) వ్యవసాయ పనుల కోసం శుక్రవారం కొత్తగూడెంలోని ఓ ట్రాక్టర్ షోరూమ్ నూతన ట్రాక్టర్ ను కొనుగోలు చేశారు. ఆ ట్రాక్టర్‌ను తీసుకుని ఇంటికి వస్తుండగా, కమలాపురం క్రాస్ రోడ్డు వద్ద వాహనం అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో సోమయ్య ఇంజన్ కింద పడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుడికి భార్య జ్యోతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొత్త ట్రాక్టర్ కొనుగోలు చేసి ఇంటికి వస్తున్న క్రమంలో జరిగిన ఈ ప్రమాదం ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధు ప్రసాద్ తెలిపారు.

# అధికారులకు, ఎమ్మెల్యేకు కానరాని ప్రజల ఇబ్బందులు





**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 31, ప్రజాజ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల జిసిసి బంకు వద్ద రోడ్డు చాలా దారుణంగా తయారై మండలం నుంచి కొత్తగూడెం జిల్లాకు వెళ్లే ప్రయాణికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మొత్తం గుంతలతో నిండిపోయి, వర్షాలు పడితే నీరు నిలిచి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. ఈ మార్గం మీద ప్రతి రోజూ వందలాది వాహనాలు సంచరిస్తుండటంతో ప్రజలు ప్రాణాలు పణంగా పెట్టుకుని ప్రయాణం చేస్తున్నారు. ఎన్నో రోజులుగా సమస్య కొనసాగుతున్నా, దీనిపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు శ్రద్ధ లేకపోవడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. రోడ్డు పరిస్థితి రోజురోజుకూ మరింత క్షీణిస్తోంది. స్థానికులు పలుమార్లు అధికారులను, నాయకులను సంప్రదించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. జిసిసి బంక్ పరిసర ప్రాంతంలో నీరు ఎప్పుడూ నిలిచి ఉండటంతో రోడ్డు పూర్తిగా చెదిరిపోయింది. బైక్ దారులు గుంతల్లో పడిపడి గాయపడిన ఘటనలు తరచుగా జరుగుతున్నాయి. "ప్రాణాలు పోతే కానీ పట్టించుకోరా?" అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రజల ఇళ్ల వద్దకు వచ్చే నాయకులు ఇప్పుడు ఈ రోడ్డు దుస్థితి చూడటానికి కూడా రారని ప్రజలు విమర్శిస్తున్నారు. "ప్రజల సమస్యలు ఎవరు వింటారు? రోడ్డు మరమ్మతులు ఎప్పుడు చేస్తారు?" అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజల ప్రయాణ సౌకర్యం దృష్ట్యా తక్షణ మే రహదారి మరమ్మతులు చేసి, డ్రైనేజీ సక్రమంగా ఏర్పాటు చేయాలని ప్రజలు జిల్లా అధికారులను కోరుతున్నారు. లేకపోతే తీవ్ర నిరసనలకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

# నీటి కోసం కోటి కష్టాలు ... చదువేలా సాగాలి

- ములకలపల్లి ఏకలవ్య పాఠశాలలో విద్యార్థుల ఇబ్బందులు
- ఆందోళనకు దిగిన విద్యార్థులు
- స్పందించిన ఎమ్మెల్యే జారే
- , ప్రిన్సిపాల్ పై ఎమ్మెల్యే ఆగ్రహం





**ములకలపల్లి, అక్టోబర్ 31, ప్రజాజ్యోతి :** మండలంలోని మూకమామిడి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ఈఎంఆర్ఎస్ లో గత రెండు రోజులుగా తాగునీరు మరియు ఇతర అవసరాల కోసం నీరు అందుబాటులో లేకపోవడంతో శుక్రవారం విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి నిరసన తెలిపారు. నీటి సమస్యతో పాటు టాయిలెట్లు పరిశుభ్రతగా లేవని, దాంతో ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్యార్థినులు తగిన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. రాత్రిపూట విద్యుత్ కోతలతో దోమల బెడద పెరిగిందని వారు వాపోయారు. ఆర్ సి ఓ వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని బిష్మించుకొని కూర్చున్నారు.

### ఎమ్మెల్యే ఆదినారాయణ తక్షణ

### స్పందన

విద్యార్థుల ఆందోళన గురించి సమాచారం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వెంటనే పాఠశాలకు చేరుకుని, విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. వారి సమస్యలను కూలంకషంగా తెలుసుకుని, తాగునీరు, విద్యుత్, భోజన వసతులు వంటి అంశాలపై తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### ప్రిన్సిపాల్ పై ఎమ్మెల్యే ఆగ్రహం

పాఠశాలలో నెలకొన్న పరిస్థితులను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రిన్సిపాల్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల పరిపాలన పూర్తిగా వైఫల్యం చెందిందని, విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులకు నివేదించి, బాధ్యులపై చర్యలు తీసుకునేలా చూస్తామని ఆయన విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీతో విద్యార్థులు తమ ఆందోళనను విరమించారు

## ఘనంగా ఏఐటియుసి ఆవిర్భావ దినోత్సవం

- 106 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర గల సంఘం ఏఐటియుసి
- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి. నరాటి ప్రసాద్



**ములకలపల్లి, అక్టోబర్ 31, ప్రజాజ్యోతి :** మండల కేంద్రంలో సొసైటీ ఆఫీస్ వద్ద గల హమాలీ అడ్డ ముందు ఏఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొనీ ఏఐటియుసి జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1920 సంవత్సరం అక్టోబర్ 31 వ తారీకున ముంబై నగరంలో ఏఐటీయూసీ ఆవిర్భవించినదని ఆనాటి నుండి ఈనాటి వరకు కార్మికులు కష్టాల తరఫున పోరాడుతూ వారి హక్కులకై నిరంతరం పోరాటాలు ఉద్యమాలు చేస్తూ ఈరోజు 105 సంవత్సరాలు పూర్తి చేసుకుని 106 వ సంవత్సరంలోకి అడిగిడుతుందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరి చూపిస్తూ శ్రమదోపిడి చేస్తున్నారని గ్రామ పంచాయతీ కార్మికులకు, వివోఏ లు, అంగన్వాడీలకు ఈఎస్ఐ హెల్త్ కార్డు సౌకర్యం కల్పించాలని అన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, 50 సంవత్సరాలకే హమాలీలకు, బిల్డింగ్ వర్క్ కు వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం రాజుపేట కాలనీ హమాలి అడ్డ వద్ద ఏఐటీయూసీ జెండా ఎగరవేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నకిరేకంటి పుల్లారావు మిరియాల వెంకటేశ్వర్లు. పసుపులేటి వెంకటేశ్వర్లు. చిన్నబోయిన వెంకన్న. రాచూరి రవీంద్ర. రాచూరి శేఖర్. కె నరసింహారావు ఎన్.నరసింహారావు. గద్దల రమేష్, రావుల రమేష్, నకిరేకంటి నరసింహారావు, ఆది, సాగర్, తదితరులు పాల్గొన్నారు..